అధికార పార్టీ వారికే పల్లె పండగ

- టీడీపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌ల పంచాయతీల్లోనే పల్లె పండగ పనులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌ల గ్రామాలకు పనులు మంజూరు చేయని వైనం



పల్లె పండగలో భాగంగా మరువాడ -కొత్తవలస గ్రామాల మధ్య ,చేపడుతున్న సీసీ రోడ్డు పనులు(ఫైల్)

బొండపల్లి: ''గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్లక్ష్యం చేసింది, పంచాయతీ నిధులను మళ్లించి, ఎలాంటి అధికారాలు లేకుండా సర్పంచ్‌లను ఊరేగింపు విగ్రహాలుగా చేశారు. సర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని నిలబెడతాం, అన్ని పంచాయతీలకు ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు మంజూ రు చేస్తాం, పంచాయతీలను బలోపేతం చేస్తాం'' ఆగస్టు 23న అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన మాటలివి. అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి, ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు పంచాయతీల పాలకవర్గాల తీర్మానం చేశాయి. పల్లె పండగ పేరిట ఈ పనులను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రామ సభల్లో చేసిన తీర్మానాలను పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ అధికారులకు నివేదించారు. ఇంత వరకు అంతా బాగానే ఉన్నా..అసలు కథ ఇక్కడ నుంచే మొదలైంది. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన మాటలు, హామీలు క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. మండలంలో అన్ని పంచాయతీల్లోనూ ఉపాధి పనులకు తీర్మానాలు చేసినా, కొన్ని పంచాయతీలకే అధికారులు పనులు మంజూరు చేశారు. మండలంలో 34 గ్రామాలు, 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు 20 పంచాయతీల్లో ఉండగా, టీడీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు 8 పంచాయతీల్లో ఉన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఎం.కొత్తవలస, మరువాడ, కెరటాం, దేవుపల్లి, రయింద్రాం, కొత్తపాలెం, సి.టి.కె.పల్లి, బోడ సింగిపేట, గొల్లుపాలెం పంచాయతీలకే పనులు మంజూరు చేశారు. ఈ పంచాయతీల పరిధిలో సిమెంట్ రోడ్లు, సీసీ కాలువలు, బీటీ రోడ్ల నిర్మాణం వంటి 33 పనులను రూ.4.67 కోట్లతో చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. అధికార పార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకే ప్రభుత్వం పనులు మంజూరు చేసి, మిగతా పంచాయతీలపై వివక్ష చూపారు. 20 పంచా యతీల్లో పనులను గుర్తించి, తీర్మానాలు చేసినా మంజూరు కాలేదు. అన్ని గ్రామాలకు పనులు మంజూరు చేస్తామని చెప్పిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో టీడీపీ మద్దతుదారులకే పనులు కల్పించ డంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. పల్లె పండగ పనులు సర్పంచ్‌లు ఆధ్వర్యంలోనే చేపట్టాల్సి ఉన్నప్పటికీ, టీడీపీ కార్యకర్తలకు ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు ప్రభుత్వం వెండర్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు,గంట్యాడ, గజపతినగరం మండలాల్లోని పలు గ్రామాల్లో ఇప్పటికే పనులను సర్పంచ్‌లను కాదని, టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టారు. కొన్ని చోట్ల పంచాయతీలు తీర్మానించిన పనులు కాకుండా టీడీపీ నాయకులు సూచించిన పనులను అధికారులు మంజూరు చేయడం గమనార్హం.

రెండో విడతలో మంజూరు చేస్తాం

పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా తొలివిడతలో మండలంలో 9 పంచాయతీలకు పనులు మంజూరు చేశాం. రెండో విడతలో మిగతా పంచాయతీలకు మంజూరు చేస్తాం. గ్రామసభల్లో తీర్మానించిన పనులను ప్రాధాన్యాత క్రమంలో చేపడతాం. మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత మిగతా గ్రామాల్లో పనులకు శ్రీకారం చుడతాం.

– జి.గిరిబాల, ఎంపీడీఓ, బొండపల్లి మండలం

క్లుప్తంగా

మద్యం సీసాల పట్టివేత

జామి: మండలంలోని జట్టేడివలస గ్రామంలో ప్రొహిబిషన్ శాఖ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఒకరి నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీ తెలిపారు.

సారా విక్రయాలపై ప్రత్యేక నిఘా



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖరనాయుడు

కొత్తవలస: సారా విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జీఎస్ రాజశేఖరనాయుడు అన్నారు. మండలంలోని ముసిరాంలో నవోదయం-2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది టి.వీర్రాజు, బి.రాయుడు, బి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండా జయంతి వేడుకలు



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: ఆదివాసీ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతి ఉత్సవాలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బిర్సాముండా చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిర్సా ముండా ఆదివాసీల హక్కుల కోసం బ్రిటిషర్లతో యుద్ధం చేసి స్వాతంత్ర్య స్ఫూర్తిని, చైతన్యాన్ని రగిల్చారన్నారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17, అండర్-19 బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బాలల దినోత్సవం సందర్భంగా వీరిని పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు గురువారం అభినందించి, బహుమతులు అందజేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి పెట్టండి



గంట్యాడ మండల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గజపతినగరం మండల నాయకులతో సమావేశమైన అప్పలనరసయ్య

గంట్యాడ/గజపతినగరం: సాగునీటి సంఘాల ఎన్ని కలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నా యకులు దృష్టిపెట్టాలని గజపతినగరం మాజీ ఎ మ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. విజ యనగరంలోని ఆయన నివాసంలో గంట్యాడ మండలం,గజపతినగరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో గురువారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్పి తే తన దృష్టికి తీసుకురావాలన్నా రు. కూటమి ప్రభుత్వం ఈ అయిదు నెలల పాలనలో అన్ని వర్గాల వారిని మో సం చేసిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలు ఇప్పుడు చర్చించుకుంటున్నారని, అన్నివర్గాల వారి మద్దతు వైఎస్సార్‌సీపీకి ఉంటుందని అన్నారు. గంట్యాడ జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి,జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, రామసూర్యం, ప్రభూ జీ, గజపతినగరం జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, కరణం ఆది నారాయణ,మధుపాడ సర్పంచ్ కడుపుట్ల పైడిపునాయుడు,నాయకులు బైరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌పైకి దూసుకెళ్లిన ట్యాంకర్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.భూర్జవలసలో బుధవారం రాత్రి ఓ ట్యాంకర్ అదుపుతప్పి పోలీ స్‌స్టేషన్‌పైకి దూసుకెళ్లింది.రామభద్రాపురం నుంచి గజపతినగరం వైపు వెళుతున్న ట్యాంకర్ ఎస్.భూర్జవలస వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పోలీస్ స్టేషన్‌పైకి దుసుకొచ్చి, ముందు భాగంలోని గోడను ఢీకొట్టింది. అయితే ఈ ప్రమాదంలో పోలీస్ స్టేషన్‌లోని సిబ్బందికి కానీ, ట్యాంకర్ డ్రైవర్ కానీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గురువారం ఉదయం ట్యాంకర్‌ను జేసీబీ సహాయంతో పోలీసులు బయటకు తీయించారు.



పోలీస్ స్టేషన్ గోడను ఢీకొట్టిన ట్యాంకర్

గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

బొండపల్లి: గ్రామాల అభివృద్ధికి సరైన ప్రణాళికలు అవసరమని ఎంపీడీఓ జి.గిరిబాల అన్నారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచి వాలయ డిజిటల్ అసిస్టెంట్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతీ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అవసరాలను గుర్తించి, అభివృద్ధి పనులకు ప్రణాళికలను తయారు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ఈఓపీఆర్డీ ఏ.రఘుపతిరావు పాల్గొన్నారు.

కోటమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామదేవత కోటమ్మ ఆలయంలో హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్ నేతృత్వంలో గురువారం ఉదయం లెక్కించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి నవంబర్ 14 వరకూ రూ.6,21,650 ఆదాయం వచ్చినట్టు అధికారు లు ధ్రువీకరించారు. దేవదాయశాఖ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

దత్తిరాజేరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈసమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా దీపోత్సవం....



చీపురుపల్లి పట్టణంలోని ఉమానీల కంఠేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి లక్ష కిస్మిస్ పండ్లతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు.

– చీపురుపల్లి

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు



కొత్తవలస: 108 వాహనం వద్ద సమ్మె నోటీస్‌ను చూపిస్తున్న 108 ఉద్యోగులు

- 108 ఉద్యోగులు



వేపాడ: వేపాడలో ఎంపీడీఓ సూర్యనారాయణకు 108 సిబ్బంది సమ్మెనోటీసు అందజేస్తున్న సిబ్బంది

కొత్తవలస/వేపాడ: తమ సమస్యలు పరిష్కరించని ఎడల ఈ నెల 25 నుంచి సమ్మె చేపట్టక తప్పదని 108 ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ మేరకు కొత్తవలస, వేపాడ మండల కేంద్రాల్లో గురువారం ఆందోళనలు చేపట్టారు. తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పెండింగ్ జీతాలను చెల్లించాలని, ప్రభుత్వమే సర్వీస్‌లను నిర్వహించాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో 108 సిబ్బంది పి.సుబ్బరాజు, పి.ఆనందరావు, జి.అచ్చారావు, జి.ఈశ్వరారావు, ఎం.విజయభాస్కరరావు, ప్రకాష్, అనిల్‌దేముడు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులను గుర్తించేందుకు సర్వే

బొండపల్లి: క్యాన్సర్ బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ తెలి పారు. మండలంలోని అంబటివలస గ్రామంలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది గురువారం నిర్వహించిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వచ్చి రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, ప్రజలు సిబ్బందికి సహకరించి, పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ,సమీర, హెల్త్ సూపర్ వైజర్ ఎస్.ఏ.బాషా, హెల్త్ సహాయకులు బి.విశ్వేశ్వరరావు ఉన్నారు.



అంబటివలసలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ

గ్రంథాలయాలు... విజ్ఞాన భాండాగారాలు



జామి : జామి గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ జయశ్రీ



వేపాడ: వేపాడలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పలువురు వక్తలు అన్నారు. గజపతినగరం, చీపురుపల్లి, శృంగవరపుకోట నియోజకవర్గాల్లోని శాఖా గ్రంథాలయాల్లో లైబ్రేరియన్‌ల ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈఓలు అతిథిలుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని, యువత, విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని సముపార్జన చేయాలని, గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. లైబ్రేరియన్‌లు మాట్లాడుతూ వారంరోజుల పాటు విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

– గజపతినగరం/శృంగవరపుకోట/వేపాడ/బొండపల్లి/కొత్తవలస/లక్కవరపుకోట/జామి/చీపురుపల్లిరూరల్(గరివిడి)/మెరకముడిదాం



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో మాట్లాడుతున్న ఎంఈఓ రామారావు



శృంగవరపుకోట: ఎస్.కోటలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

సంక్షిప్తంగా

వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ శ్రీవేణి

చీపురుపల్లి: పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద స్థానిక లయన్స్‌క్లబ్, లయన్స్ స్టార్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురు వారం వైద్యశిబిరం నిర్వ హించారు. పట్టణానికి చెందిన వెంకటకృష్ణ పోలీక్లినిక్ వైద్యురాలు కె.శ్రీవేణి 48 మందికి సుగర్, బీపీ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షు లు గంట్యాడ విష్ణుమూర్తి, డి.సీతారామరాజు, ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

వేపాడ: బక్కునాయుడుపేట గ్రామంలో గురుకుల బాలికల పాఠశాలను ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓ-2 బాలభాస్కరరావు గురువారం సందర్శించా రు. వసతిగృహంలో మౌలిక సదుపాయాలను,స్టాక్ రూమ్‌లో వంట సరుకుల నిల్వలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థినులను ఆరా తీశారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్‌ప్రిన్సిపాల్ లక్ష్మికి పలు సూచనలు చేశారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

పాఠశాలల్లో తనిఖీలు

జామి: మండలంలో జాగరం,తానవరం ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈఓ-2 గంగరాజు గురువారం తనిఖీలు చేశా రు.విద్యార్థుల హాజరు రికార్డులను, వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి వారి అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు.

కెల్లలో అన్నదానం



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న కె.వి.సూర్యనారాయణ రాజు, ఆలయ కమిటీ సభ్యులు

గుర్ల: కెల్ల గ్రామంలోని శివాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ముందుగా శివాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు 5వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి గోదావరి దేవి స్కూల్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చీపురుపల్లి కోర్టు జడ్జి హేమలత



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ జి.వి.సత్యవేణి



చీపురుపల్లి: రామలింగాపురంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అనంతం, ఎంఈఓ



గజపతినగరం: గజపతినగరంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్ఫూర్తి వాకర్స్ క్లబ్ సభ్యులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): వెదుళ్లవలసలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సమతాసైనిక్‌దళ్ సభ్యులు



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట జ్యోతీబాపూలే పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో



మెరకముడిదాం: చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం రాంబాబు



వేపాడ: వేపాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సందడి



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చీపురుపల్లి: వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



గుర్ల: పాలవలస పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన రోజును పురస్కరించుకుని చీపురుపల్లి, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సామాజిక సేవా కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.పాఠశాలల్లో వివిధ ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజే శా రు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల వేషధారణలు, పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.శృంగవరపుకోట మండలంలోని ధర్మవరంఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు వెంపడాపు ఈశ్వరరావు 450మంది విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: ధర్మవరం హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడు అందజేసిన మొక్కలతో విద్యార్థులు



బొండపల్లి: బోడసింగిపేటలోని డివెన్ సేవియర్ స్కూల్ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు